సచివాలయాలతో గ్రామస్వరాజ్యం

- పల్లె ముంగిటకే పాలన
- స్థానికంగానే ప్రజా సమస్యల పరిష్కారం
- గ్రామీణులకు తప్పిన వ్యయప్రయాసలు

నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు	
మొత్తం సచివాలయాలు	53
సేవలందిస్తున్న సిబ్బంది	425
ఇప్పటి వరకు సేవలు పొందిన లబ్ధిదారులు	74,391



కృష్ణాపురం గ్రామ సచివాయం

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య పాలనను సాకారం చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను పల్లెల ముంగిటికి తీసుకొని వచ్చి ప్రజా పాలన అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. గ్రామ పరిపాలన ప్రజలకు అందించడమే కాకుండా పరిసరాల సౌలభ్యం కోసం నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.40లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టింది.

సచివాలయాలు.. సేవలు

ఆత్మకూరు మండలంలో మొత్తం 11 సచివాలయాలకు గాను 92 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. బండి ఆత్మకూరు మండలంలో 15 సచివాలయాలుండగా 110 మంది, మహానందిలో 11 సచివాలయాలు, 92 మంది సిబ్బంది, వెలుగోడులో 13 సచివాలయాలు, 98 మంది, శ్రీశైలంలో 3 సచివాలయాల్లో 33 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఇందులో ఆత్మకూరు పట్టణం, మండలంలోని సచివాలయాల ద్వారా 20,155 మందికి సేవలందించారు. అలాగే వెలుగోడులో 14,160, శ్రీశైలం 7,130, బండి ఆత్మకూరు 18,186, మహానంది మండలంలోని సచివాలయాల్లో 14,760 మంది లబ్ధిదారులు సేవలు పొందారు.

మండల కార్యాలయాలకు స్వస్తి ..

సచివాలయ వ్యవస్థ రాకముందు అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల కోసం మండల, తాలూకా, జిల్లా స్థాయి కార్యాలయాలకు వెళ్లి వివిధ పనులు నిర్వహించుకునేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక గ్రామాల్లోనే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వం అందించే నవరత్నాల పథకాలతో పాటు పింఛన్లు, పక్కా గృహాలు, రైతు సమస్యలు, విద్యాదీవెన, విద్యావసతి లాంటి ఎన్నో సంక్షేమ పథకాలకు సంబంధించి సొంతూళ్లోనే దరఖాస్తు చేసుకుంటూ ప్రజలు నేరుగా లబ్ధి పొందుతున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కారం



ప్రభుత్వ పథకాలు సంబంధించి ఏ సమస్య ఉన్నా నేరుగా సచివాలయం వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నాం. అక్కడికక్కడే లోపాలను తెలుసుకొని సమస్యలను పరిష్కరించుకొని, పథకాలకు దరఖాస్తు చేసుకుంటూ లబ్ధి పొందుతున్నాం.

–రామకృష్ణారెడ్డి, కృష్ణాపురం

నిజమైన గ్రామ స్వరాజ్య పాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం. వెనుకబడిన పల్లెల్లో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొని వచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. సచివాలయం ఏర్పడటం వల ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు నేరుగా పల్లెల్లోనే లబ్ధిదారులకు అందుతున్నాయి. ఒకప్పుడు ఏదైనా పథకం కావాలంటే మండల కేంద్రానికి వెళ్తే తప్ప పరిష్కారం అయ్యేది కాదు.

– నాగేశ్వరరెడ్డి, కురుకుంద

ఇంటి స్థలం మంజూరు



మా గ్రామంలో సచివాలయం ఏర్పడటం వల్ల ప్రభుత్వపరంగా పింఛన్, ఇంటి స్థలాలు పొందాం. గతంలో ఇంటి స్థలం పొందాలంటే దూరంగా ఉన్న ఆత్మకూరు మండల కేంద్రానికి వెళ్లి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేవారం. ఆ సమస్య పరిష్కారం కావాలంటే నెలల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఉండేది. గ్రామంలో సచివాలయం ఉండటం వలన అప్పటికప్పుడే సొంత ఊళ్లోనే దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ పథకాలను పొందుతున్నాం.

– విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్దాంపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొని రావడం హర్షించదగ్గ విషయం. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైద్య కేంద్రాలు, లైబ్రరీ కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– వరాలమాలి ఆత్మకూరు

నేడు 'స్పందన'

నందికొట్కూరు: రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం జరుగుతుందని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. మండల ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి సమస్య లున్నా అర్జీల రూపంలో తెలియజేస్తే సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

టిప్పర్ల అడ్డగింత



టిప్పర్లను అడ్డగించిన బానకచెర్ల గ్రామస్తులు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల గ్రామంలో ప్రజలు మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లను ఆదివారం అడ్డుకున్నారు. గ్రామస్తుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు దాదాపు 2 నెలల నుంచి బీటీ రహదారి మరమ్మతుల నిర్మాణానికి అనుమతి లేదంటూ నిలిపివేశారన్నారు. అయితే వీబీఆర్ కాలువ వెంట సైడ్ బండ్‌కు వెలుగోడు వరకు టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారన్నారు. బానుముక్కల నుంచి అటవీ మార్గం గుండా గ్రామంలో టిప్పర్లు తిరుగుతున్నాయన్నారు. అటవీలో ఈ టిప్పర్లు తిరగడానికి అటవీ శాఖ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రతి రోజు దాదాపు 100 ట్రిప్పులు తిరుగుతున్నాయన్నారు. దీంతో గ్రామంలో దుమ్ముధూలితో పాటు రహదారి కూడా దెబ్బతింటోందని వాపోయారు. టిప్పర్లను గ్రామంలో తిరగనివ్వమని తేల్చి చెప్పారు.

క్లుప్తంగా

కొత్తపల్లి ఎంఈఓ -2గా ఇనాయతుల్లా



కొత్తపల్లి: మండల విద్యాశాఖాధికారి -2గా ఇనాయతుల్లాను నియమించినట్లు అధికారులు ఉత్తర్వులు జారిచేశారని ఆదివారం మండల విద్యాధికారి-1 శ్రీరాములు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నిరంతర పర్యవేక్షణ, అభివృద్ధి కార్యక్రమాలు, మనబడి నాడు-నేడు నిర్వహణ తదితర వాటిని మరింత బలోపేతం చేయడానికి మండల విద్యాధికారి-2ను నియమించారని చెప్పారు. ఇయన ఇదివరకు ఆస్పరి మండలం జోహరాపురం జిల్లాపరిత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై వచ్చారని తెలిపారు.

జూపాడుబంగ్లాకు శ్రీనివాసులు

జూపాడుబంగ్లా: ఎంఈఓ-2 గా పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం జూపాడు బంగ్లా-1 ఎంఈఓ గా తిమ్మారెడ్డి ఉండగా సోమవారం నుంచి ఎంఈఓ-2గా శ్రీనివాసులు కొనసాగనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మహానంది: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలని బండిఆత్మకూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరిత, ఎంపీడీఓ వాసుదేవగుప్త అన్నారు. బండిఆత్మకూరులో ఆదివారం జగనన్న సురక్ష పథకంపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్ బాషా ఆదివారం తెలిపారు. బి.ఏ (హిస్టరీ), బి.కాం (జనరల్), బి.ఎస్సీ (ఫిజిక్స్) తోపాటు బి.ఏ (పొలిటికల్ సైన్స్), బి.కాం (కంప్యూటర్ అప్లికేషన్), బి.ఎస్సీ (మ్యాథ్స్) కోర్సులు ఉంటాయని ఆయన తెలిపారు. దరఖాస్తులను ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 9441290749కు సంప్రదించాలని చెప్పారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



రోడ్డుకు అడ్డంగా ఉన్న చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం , బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టినట్లు ఈఓఆర్డీ ఫకృద్దీన్ తెలిపారు. ఆదివారం సర్పంచ్ జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో డ్రైనేజీలో మురుగు నిల్వలను, పూడికను తొలగించడం, కాలనీలల్లో చెత్తచెదారం తొలగించే కార్యక్రమం చేపట్టారు.

మహానందిలో సండే సందడి



భక్తులతో కిటకిటలాడుతున్న మహానంది కోనేరు

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తజనసందడిగా మారింది. రెండు తెలుగురాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులరద్దీ నెలకొంది. దీంతో ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

స్మృతివనంలో పర్యాటకుల రద్దీ



స్మృతివనంలో పర్యాటకులు

ఆత్మకూరు: నల్లకాల్వ సమీపంలోని వైఎస్సార్ స్మృతివనానికి ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు ప్రాంతాల నుంచే కాకుండా నంద్యాల, కర్నూలు ప్రాంతాల నుంచి పర్యాటకులు విచ్చేయడంతో సందడి నెలకొంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సెల్ఫీలు తీసుకున్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



హరీష్‌నాయక్(ఫైల్)

పాములపాడు: మండలంలోని బానకచెర్ల గ్రామానికి చెందిన హరినాయక్ (32) అనే రైతు అప్పుల బాధతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ అశోక్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మృతుడు నాలుగు సంవత్సరాలుగా 4 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. దాదాపు రూ.10లక్షలు అప్పులయ్యాయి. అప్పులు తీర్చలేనని మనస్థాపానికి గురై మే 30వతేదీ పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడన్నారు. మృతుని భార్య శకుంతలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్టు

నందికొట్కూరు: పట్టణంలోని బీఎస్ఎస్ఆర్ నగర్‌లో మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని వలి, ఇంతియాజ్, చాంద్‌బాషా, బాషా అనే మట్కా బీటర్ల నుంచి రూ, 12, 100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మట్కా బీటర్ల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నకిలీ విత్తనాల కట్టడికి టాస్క్‌ఫోర్స్ కమిటీ

మహానంది: బండిఆత్మకూరు మండలంలో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి స్వాతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తహసీల్దార్, ఎస్‌ఐ, ఏఓ ఆధ్వర్యంలో కమిటీ వేశారన్నారు. గ్రామస్థాయిలో మహిళా పోలీస్, వీఆర్‌ఓ, ఏఓలతో కూడిన కమిటీలు ఉంటాయని చెప్పారు. ఎవరైనా నకిలీవిత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయిస్తే రైతులు తమకు సమాచారం అందించాలని కోరారు.

మల్లికార్జున ప్రాజెక్టు వద్దు

మిడుతూరు: మల్లికార్జున ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల భూములు, గ్రామాలు ముంపు గురవుతాయని.. ప్రాజెక్టు నిర్మాణం వద్దని, రైతుల భూములు మద్దుని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఏపీ రైతు సంఘం మండల కమిటీ సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మల్లికార్జున రిజర్వాయర్‌ను మిడుతూరు - ఓర్వకల్లు మండలాల మధ్య 16 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టడానికి 1.55 కోట్లు సర్వే చేసేందుకు కేటాయించారన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల భూములు ముంపునకు గురికాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ, నాగరాజు, శేఖర్, రమణయ్య, వెంకటేశ్వర్లు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మహానంది: పోరాటాలు, ఉద్యమాలతో ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు తెలిపారు. మహానందిలోని శాలివాహన అన్నసత్ర భవన ప్రాంగణంలో ఆదివారం సీపీఐ నంద్యాల జిల్లా రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేదలపై భారం మోపుతున్నాయన్నారు. కార్పోరేట్ వారికే ప్రభుత్వాలు మేలు చేకూరుస్తున్నాయి తప్పా పేదలకు చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, గిరిజన సమాఖ్య రాష్ట్ర నేత మోటా రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండ్లెంలో 'గడప గడపకు'

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో సోమవారం ఉదయం 9.30గంటలకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. కార్యక్రమానికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు. ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారన్నారు.

ఆర్థిక సాయం

మిడుతూరు: నందికొట్కూరు పట్టణంలోని నవనంది హైస్కూల్‌లో పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయుడు) గా విధులు నిర్వహిస్తున్న సంజీవ కుమార్ శుక్రవారం పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పాఠశాల కరస్పాండెంట్ మీనాక్షి శ్రీధర్ ఆదివారం మృతుడి స్వగ్రామమైన మిడుతూరుకు చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం శ్రీ నవనంది ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా మృతుని కుటుంబానికి రూ. 31 వేలు ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో మృతుని కుటుంబానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జూపాడుబంగ్లా: భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ కార్యదర్శి రమేష్‌బాబు కోరారు. ఆదివారం ఆయన తంగడంచ గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 22లక్షల మంది భవననిర్మాణ కార్మికులున్నట్లు తెలిపారు. భవననిర్మాణ కార్మికులకు గుర్తింపుకార్డులు మంజూరు చేసి తక్షణమే వారికి అందాల్సిన 11రకాల సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో దివాకర్, భాష, మౌలాలి, సలీం పాల్గొన్నారు.

మద్దయ్య మృతి తీరని లోటు

శ్రీశైలంప్రాజెక్ట్: జూపాడుబంగ్లా మండలం తరిగోపులలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న చంద్రకంటి మద్దయ్య మృతి చెందడం లోటని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకులు రాబిన్‌సన్ మాదిగ, జిల్లా కో-కన్వీనర్ బాసపోగుల దరగయ్య మాదిగ అన్నారు. ఆదివారం సున్నిపెంటలోని ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మద్దయ్య అనారోగ్యంతో ఆదివారం మరణించారని తెలిపారు. ఆయన ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలిచే వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగెళ్ల సురేష్, పాపయ్య, ప్రసాదు, దేవపాల్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం

నందికొట్కూరు: తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమించిన ప్రగతిశీల మహిళ సంఘం(పీఓడబ్ల్యు) జాతీయ కన్వీనర్ సంధ్యాపై బనాయించిన ఉపా కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 152 మందిపై ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు రాజద్రోహం కేసులు పెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆశీర్వాదం, అరుణ్‌కుమార్, శంకర్, వెంకటేశ్వర్లు, రఫి తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరులో భారీ వర్షం



పార్నపల్లెలో ఓ వీధిలో నిలిచిన వర్షపునీరు

మహానంది: బండిఆత్మకూరు మండల పరిధిలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల పరిధిలోని లోతట్టు కాలనీల్లో జలమయమయ్యాయి. పార్నపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీరు అధికంగా చేరడంతో పేదల ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో నిత్యావసరవస్తువులు, ఆహారధాన్యాలు తడిసిపోయాయని పార్నపల్లెకు చెందిన ప్రజాపతి కుమారి, కనకరాజు, బాలనరసమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల పరిధిలో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. లింగాపురం, జీసీపాలెం, రామాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది శ్రమిస్తున్నారు. అలాగే మహానంది పుణ్యక్షేత్రంతో పాటు సమీప గ్రామాల పరిధిలో ఓ మోస్తరువర్షం కురిసింది. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు సుపథ మండపాల వైపు పరుగులు తీశారు.

ఆధ్యాత్మికం

మహానందిలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం, అమావాస్య సందర్భంగా చండీహోమం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, హనుమంతశర్మ, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్థానిక యాగశాలలో ఉదయం నుంచి విశేష ద్రవ్యాలతో హోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని పూజలు చేసుకున్నారు. పూర్ణాహుతి పూజలతో చండీహోమం పూర్తి చేశారు.

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామికి అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి గణపతి పూజ, కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకం, ఆకుపూజ, మాన్యసూక్త హోమం, పల్లకీ సేవను వేదపండితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివార్లను పల్లకీలో ఆశీనులను చేసి మేళతాళతో ఆలయం చుట్టూ పదక్షిణలు చేయించారు. భక్తులకు అలగనూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిమళ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పదహారు రోజుల పండుగ

మహానంది: బండిఆత్మకూరులో కొలువైన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలు నిర్వహించిన పదహారురోజులైనందుకు ఆదివారం పదహారు రోజుల పండుగను వైభవంగా చేపట్టారు. గ్రామస్తులు, కమిటీ పెద్దల ఆధ్వర్యంలో అమ్మవారికి ఇష్టమైన జ్యోతులు, బోనాలు తీసుకెళ్లి మూలమూర్తిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి నైవే ద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో అర్చన, హారతి పూజలు చేశారు.

మల్లన్నసేవలో ఆదోని ఎమ్మెల్యే



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌కు చెందిన పి.లలిత, బృందం వారిచే నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణపతి ప్రార్థన, శివాష్టకం, జయ శివశంకర, శివస్తోత్రం, శ్రీశైలవాస, శంభో ఓ శంకర మొదలైన పలు కీర్తనలను, అష్టకాలను, భక్తి గీతాలను ఎస్.సురేఖ, రయ్య, సాయి సుధ, కిరణ్మయి తదితరులు ఆలపించారు.

స్పోర్ట్స్

ఆత్మరక్షణకు ఆయుధం తైక్వాండో



క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: తైక్వాండో ఆత్మరక్షణ ఆయుధం లాంటిదని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఆదివారం తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో నైపుణ్యాలను పెంపొందించుకొని తైక్వాండో క్రీడాకారుడిగా ఎదగాలన్నారు. అనంతరం తైక్వాండో క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఆసియామారిఫ్, తైక్వాండో కోచ్ ఖాజా, కౌన్సిలర్ విజయచౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఆత్మకూరు ఏసీఎన్ జట్టు



విజేత ఏసీఎన్ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఎస్‌ఐ హుస్సేన్ బాషా

కొత్తపల్లి: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎస్ఐ హుస్సేన్ బాషా అన్నారు. మండలంలోని దుద్యాల గ్రామంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని గడ్డం మహబూబ్ బాషా ఆధ్వర్యంలో 9వ తేదీన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించగా, పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో ఆత్మకూరు ఏసీఎన్ టీమ్, దుద్యాల లోకల్‌బాయ్స్ టీమ్ తలపడగా ఆత్మకూరు ఏసీఎన్ టీమ్ విజేతగా నిలిచింది. వారికి మొదటి బహుమతి రూ.20వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. అదేవిధంగా రెండవ బహుమతి రూ.10 వేలు నగదు, ట్రోఫీని దుద్యాల లోకల్‌బాయ్స్ టీమ్ కై వసం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మూలింటి మాసుంసా, గడ్డం షఫీవుల్లా, నంద్యాల నన్నేసా, ఆర్గనైజర్లు కలాం, జాకీర్, శేఖర్, షేక్షా, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆదర్శం



నీటి కోసం తొట్టివద్దకు వచ్చిన వానరం

తొట్టిలో నీళ్లు నింపుతున్న కుమార్

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని వానరాలకు దాహం, ఆకలి తీరుస్తూ ఆటోడ్రైవర్ కుమార్ పలువురి ప్రశంసలు పొందుతున్నాడు. గాజులపల్లెకు చెందిన కుమార్ ఆటోలో నీటిట్యాంకు, ఆహారం, అరటిపళ్లు తీసుకెళ్లి ఘాట్‌రోడ్డు వెంట ఉన్న వానరాలకు అందిస్తుంటాడు. ఆటోలో, వాహనాల్లో వెళ్తున్నప్పుడు ఆహారం కోసం గుంపులుగుంపులుగా రావడం చూసి ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

మరింత మెరుగ్గా సేవలందించేందుకే 'జగనన్న సురక్ష'



నందికొట్కూరు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజశేఖర్‌బాబు

జూపాడుబంగ్లా: ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జులై 1 నుంచి నెలరోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొని పది రకాల సర్వీసులకు సంబంధించి ప్రజల వద్దకు వెళ్లి వారి నుంచి వివరాలు రాబట్టాలన్నారు. ప్రజలు చెప్పే సమస్యలను నోట్‌చేసుకొని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. ఆర్ఐ శ్రీరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి జగనన్న సురక్ష

కొత్తపల్లి: ఈనెల 24 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత చెరువయ్యేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మేరి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమం 24 నుంచి 30 తేదీ వరకు జరుగుతుందని వివరించారు. కార్యక్రమం ద్వారా గ్రామంలో గ్రామవలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలలో ప్రభుత్వం అందించే ఏఏ సేవలు పెండింగ్‌లో ఉన్నాయో వివరాలు సెకరిస్తారని తెలిపారు. సేకరించిన వివరాలను గ్రామ వలంటీర్ల మొబైల్‌ఫోన్లలో జగనన్న సురక్ష యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని అందులో పెండింగ్‌లో ఉన్న సేవలు అప్లోడ్ చేస్తారని చెప్పారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంపై మండల పరిధిలోని గ్రామ సచివాయాల సిబ్బందికి ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశీలనకు నోచుకోని సమస్యలను 24 గంటల్లోగా పరిష్కరించాలని సచివాయల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.